# శిష్యదక్షిణ

డా. కేతు విశ్వనాథరెడ్డి

కడప బస్స్టాండు కిటకిట లాడుతోంది, అటు ఇటు తిరుగుతున్న ప్రయాణీకులతో, వచ్చీ పోయే బస్సులతో.

'నమస్కారం' అన్న పలకరింపు విని పక్కకు చూశాను. ఓ యువకుడు ముకుళిత హస్తాలతో మరోసారి "నమస్కారం సార్!" అన్నాడు. ఎగా దిగా చూశాను. మర్యాద కోసం ప్రతి నమస్కారం చేశాను.

గుర్తుకు రావడంలేదు. కానీ ఎప్పుడో, ఎక్కడో చూసినట్లుంది. "మీరెవరో తెలియదు" అన్నట్లు ముఖం పెడితే అతను బాధపడతాడని మామూలుగానే కాస్త నవ్వుతూ ముఖం పెట్టాను.

"ఇంకా అనంతపురం గవర్నమెంటు కాలేజిలోనే పని చేస్తున్నారా సార్?" అన్నాడు.

"ఆఁ- అక్కడే?" అన్నాను.

పట్టేశాను. ఇతను నా స్టూడెంటని.

"నేను మీ స్టూడెంటుని. ఇ. హెచ్. పి. గ్రూప్" అన్నాడా యువకుడు.


"నీ పేరు?"-

"నాగరాజు!"

నిజం చెప్పాలంటే అతను అంతబాగా గుర్తులేదు. మర్యాదకోసం మాట కలపాలని ఏవేవో కాలేజి వివరాలడిగాను. అన్నీ చెప్పటం- ఒక్కొక్క సంఘటనతో, సమాచారంతో అతను నా శిష్యుడు అన్న భావం బలంగా ఏర్పడి బంధంగా మారింది. కాలేజిలో, క్లాసులో లేని చనువు, సాన్నిహిత్యం బస్స్టాండులో కలగడంతో మనసులో నేనవ్వుకున్నాను.

'ఈ బెంచీమీద కూర్చోండి సార్' అంటూ కర్చీఫ్తో బెంచి శుభ్రం చేశాడు నాగరాజు.

నేను కూర్చున్నాక, "ఇపుడే వస్తాను సార్"



టానా-ఆంధ్రసచిత్ర వార పత్రికల
సంయుక్త సాహితీ సంబరంలో
రు.500/- బహుమతి
పొందిన కథ

అంటూ అటు వెళ్ళాడు. పది నిమిషాల్లో తిరిగొచ్చాడు నాగరాజు, కాఫీపట్టుకొని.

"ఆఁ– ఎందుకీ మర్యాదలు" అంటూ పైకి మొహమాటంతో అన్నా, కాఫీ అంటే ఇష్టం కాబట్టి, లోపల మనసులోనే సంతోషంతో తీసుకొని త్రాగాను.


ఖాళీ కప్పు అందుకుంటూ, జేబులోంచి సిగరెట్టు, అగ్గిపెట్టె ఇచ్చాడు. ముట్టించి, అగ్గిపెట్టె అతడి చేతిలో పెట్టాను. కాఫీ, సిగరెట్ నాకు ప్రాణమని తెలుసుకొని, ఈ రెండూ అందించినందుకు నాగరాజంటే నాకు ఇంకా దగ్గరయ్యాడు.

గురువుని చూసి ముఖం చాటేసే శిష్యులున్న ఈ రోజుల్లో గురువుని ఇంత మర్యాద చేస్తున్న నాగరాజులాంటి వాళ్ళు ఇంకా అక్కడక్కడా ఒకరో ఇద్దరో ఉన్నందుకు ఆనందమైంది.

కాఫీకప్పు కాంటిన్‌లోపెట్టేసి, కాసేపటికి తిరిగొచ్చి, నా పక్కన నిలుచున్నాడు నాగరాజు. కూచోమన్నాను. "ఫర్వాలేదు సార్. మా లెక్చరరు మీ దగ్గర కూచోవడం బాగుండ"దని నిల్చుండి పోయాడు.

స్టూడెంటుని చూసి భయంతో పక్కకు తప్పుకోవలసిన పరిస్థితుల్లో లెక్చరర్లున్న ఈ రోజుల్లో భయభక్తులున్న నాగరాజు నాకు ఎంతో నచ్చాడు.

వాచీ చూసుకున్నాను. మూడున్నర గంటలైంది. పడమరకు వాలిన సూర్యుడి ఎండ బస్‌స్టాండు ప్లాట్‌ఫారం పాలిష్




## శిష్య దక్షిణ

బండల మీదపడి మెరుస్తోంది.

"రాజంపేట– అనంతపురం" బస్ ఇపుడు వస్తుందిలెండి సార్" అన్నాడు నాగరాజు.

"రష్ ఎక్కువ ఉంటుందేమో?! సీటు దొరుకుతుందో లేదో?!" అన్నాను ఆదుర్దాగా.

"నేనున్నాను దూరిపోయి సీటు పెడ్తాను. మీరు వర్రీ కాకండి సార్" అన్నాడు.

బస్ వచ్చేవరకు నిల్చొనే మాట్లాడుతున్నాడు, నన్ను పొగడుతూనే ఉన్నాడు– రాగయుక్తంగా నేను పద్యాలు పాడటం, శ్రీశ్రీ, తిలక్ కవితల్ని భావావేశంతో చదవటం, విశ్లేషించటం తనకెంతో నచ్చినట్లు చెప్పాడు. "మీరు తెలుగు సాహిత్యంపట్ల కల్పించిన ఆసక్తి, ఇచ్చిన స్ఫూర్తితో ఎం. ఏ. తెలుగులో యూనివర్శిటీ ఫస్ట్ వచ్చాను" అన్నాడు నాగరాజు, సంతోషాన్ని, కృతజ్ఞతని తెలుపుతున్న కంఠస్వరంతో.

ఇంతలో రాజంపేట బస్ వచ్చింది నిండుగర్భిణిలా. నా బ్రీఫ్‌కేస్ అందుకొని, రివ్వున బాణంలా దూసుకొని, బస్సు దగ్గరికి పరిగెత్తాడు నాగరాజు. నేను అతన్ని అనుసరించాను. బిలబిలమంటూ జనం బస్సు దగ్గరికి చేరారు. దిగేవాళ్ళతో, ఎక్కడానికి తోసుకొని ఎగబడుతున్న ప్రయాణీకుల్తో, ఒకటే రద్దీగా ఉంది. కిటికీలోంచి, దిగుతున్న ప్రయాణీకుడికి చేతిగుడ్డ ఇచ్చి, సీటు పెట్టమని, బ్రీఫ్‌కేసుతో అభిమన్యుడిలా తోసుకొని జనంలోకి బసెక్కడానికి దూరాడు.

చాలామంది సీట్లు లేక నిలుచున్నారు. లోన కూచున్న నాకు శిష్యుడు సీటు సంపాయించి పెట్టినందుకు గర్వంగా, సంతోషంగా వుంది. బస్సులోంచి దిగి, వచ్చి నా సీటు దగ్గర కిటికీవద్ద వచ్చి నిలుచున్నాడు. తలవంచు కున్నాడు. దిగులుగా వున్నాడు. బహుశా అంతసేపు కబుర్లు చెప్పుకొని, ఇపుడు విడిపోతున్నందుకు "మళ్ళీ ఎప్పుడో కలిసేది?" అనుకొని బాధపడుతున్నాడేమో పాపం అనుకున్నాను.

'ఈ రద్దీలో నా పర్సు ఎవరో కొట్టేశారు. ఇపుడు అర్జంటుగా హైదరాబాద్ వెళ్ళాలి. మా అమ్మకు బాగా లేదు. ఆస్పత్రిలో ఉంది!" అన్నాడు.

"అయ్యో!" అన్నాను ఆటోమేటిక్‌గా.

"అరవై రూపాయలుంటే సర్దండిసార్. మళ్ళీ మీకు మనియార్డరు చేస్తాను" అన్నాడు.

'కాదు-లేదు" అనలేని స్థితిలో ఉన్నాను నేను.


"ఫర్వాలేదు. తీసుకో" అంటూ డబ్బు ఇచ్చాను.

తీసుకుంటూ, "మీ అడ్రసు వ్రాసి ఇవ్వండిసార్" అన్నాడు. వ్రాసిచ్చాను.

హారన్ కొట్టి బస్ స్టార్టు చేశాడు డ్రైవరు. కండక్టరు తలుపు మూశాడు.

"వెళ్ళొస్తాను" అన్నాను నేను.

### డా. కేతు బుచ్చిరెడ్డి



డా. కేతు బుచ్చిరెడ్డి (48) 'శిష్యదక్షిణ' కథానిక రచయిత. వీరి హైస్కూలు, కాలేజీ చదువు కడపలో, ఎం.బి.బి.ఎస్. గుంటూరులో జరిగింది.

డా. బుచ్చిరెడ్డి 'ఆర్కెస్ట్రా' కవితా సంకలనంలో ఆర్కెస్ట్రా కవుల్లో ఒకరు. 'పోలీసు వాచకం' ప్రధానం సహ రచయిత. 'ముత్యాలు-రత్నాలు' 'ఇదుగో సూర్యుడు' కథా సంపుటాలు వీరి రచనలే. దాదాపు అన్ని పత్రికలలో రచనలు ప్రచురింపబడ్డాయి. ఆకాశవాణి కడపలో కొన్ని రచనలు ప్రసారమయ్యాయి. 1984లో ఒక ప్రముఖ వార పత్రిక నిర్వహించిన కథల పోటీలో వీరు ద్వితీయ బహుమతి పొందారు. ప్రస్తుతం అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో మెడికల్ ఆఫీసరుగా పని చేస్తూ, అనంతపురం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడిగా, అనంతపురం 'కళాపీఠం' ఉపాధ్యక్షుడిగా వుంటున్నారు. వీరు తనను పరిచయం చేసుకుంటూ–

"వృత్తి-వైద్యం, ప్రవృత్తి-సాహిత్యం రెండిటి మధ్య ఎదుగుతున్న వ్యక్తిత్వం గుడిగోడల రాళ్ల మధ్య పెరుగుతున్న వృక్షం, రెండిటి మధ్య సాగిన వారధి-నేను" అంటున్నారు.

"మంచిది. నమస్కారం సార్" అన్నాడు నాగరాజు రెండు చేతులు జోడిస్తూ.

* * * * * *

మధ్యాహ్న భోజనానికి ఇంటికి వచ్చిన నాకు జాబు ఒకటి అందించి వంటింట్లోకి వెళ్ళింది నా శ్రీమతి లక్ష్మి. ఇన్‌లాండ్ లెటరది. చేతివ్రాత అపరిచితంగా వుందనుకుంటూ తెరిచి చదవటం మొదలెట్టాను.

"సార్! నమస్తే!"

కడప బస్ స్టాండు - అరవై రూపాయలు నేనెవరో గుర్తొచ్చానా సార్!

ఎం. ఏ. పాసయి పదేళ్ళుగా నిరుద్యోగిని. చదువుకు, అర్హతకు సంబంధం ఉన్నా, లేకున్నా, అన్ని ఉద్యోగాలకు అప్లయి చేశాను. అన్ని ఇంటర్వ్యూలకు హాజరయ్యాను. కొన్నేళ్ళు మా వాళ్ళు అప్లికేషన్స్‌కి, ఇంటర్వ్యూలకి డబ్బు యిచ్చారు. ఇపుడు ఆశ వదులుకున్నారు. చెట్టంత కొడుకు చేతి కొచ్చాడని ఆశించిన నా ముసలి తలి తండ్రులు, చెట్టు పుట్టల పాలయ్యాడని కుమిలి పోతున్నారు. అప్లికేషన్‌కు పెట్టే ఖర్చుతో ఒకపూట గడుస్తుందనే స్థితిలో నా ఉద్యోగ ప్రయత్నానికి కూడా సాయపడలేకున్నారు. ఇల్లు గుల్ల చేసుకొని ఇన్నేళ్ళు పెట్టింది చాలని, నాకు తిండి పెట్టలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో అప్పు అని చెప్పి మోసంచేసి అరవై రూపాయలు తీసుకున్నాను. నా తిండికి, ఉద్యోగాన్వేషణకి ఇది తప్పనిసరి సంపాదనా మార్గమైంది. ఈ మార్గం గుట్టు బట్టబయలైతే, మూసి వేయబడితే, ఇంకో మార్గం కనిపెడతా. అవసరాన్నిబట్టి నా మార్గం మారుతుంటుంది. ఇలా సేకరించిన డబ్బు వివరాలు, వ్యక్తుల అడ్రసులు పట్టిక తయారు చేశాను. ఉద్యోగం అంటూ వస్తే ఎవరి డబ్బు వాళ్ళకి పంపించేస్తాను. అంతవరకు మోసం చేసినందుకు క్షమించండి. ఉద్యోగం వస్తే అప్పు తిరిగొస్తుందని సమాధాన పడండి. నమ్మకముంటే ప్రార్థించండి.

ఇట్లు
మీ శిష్యుడు,
నిరుద్యోగి నాగరాజు.

తాజా కలం, నిరుద్యోగి నా ఇంటిపేరు కాదు!నాగరాజు నా అసలు పేరు కాదు!! సందర్భాన్నిబట్టి, మార్గాన్నిబట్టి నా పేరు మారుస్తుంటాను. కానీ ఖచ్చితంగా నేను కాలేజిలో మాత్రం మీ శిష్యుణ్ణే.!!!

జాబు మడతపెట్టి, కణత నొక్కి పట్టి ఆలోచిస్తున్న నాకు - కాలేజీలు, యూనివర్శిటీలు, లెక్చరర్లు, ప్రొఫెసర్లు, విద్యార్థులు - డిగ్రీలు -నిరుద్యోగులు -ప్రభుత్వాలు -కళ్లముందు కదిలాయి. కాలేజీలు నిరుద్యోగ యువకుల్ని ఉత్పత్తి చేసే కార్ఖానాల్లా అనిపించాయి. భయం, అసహ్యం, దిగులు, క్షోభ చోటు చేసుకున్నాయి.

రేపటినుండి కాలేజికి వెళ్లాలంటే సిగ్గుగా, జంకుగా ఉంది.

"ఎవరినుండి ఉత్తరం, సంగతులు ఏమిటి?" అంది వంట యింట్లోంచి వచ్చిన నా శ్రీమతి.

భయంకరమైన, దారుణమైన నిరుద్యోగ యువత పరిస్థితుల్ని గురించి చెప్పనా? లేక నేను సమర్పించిన "శిష్య దక్షిణ"ను గూర్చి చెప్పనా? ఏం చెప్పను?

●



## "దేశోద్ధారక" టెలి ఫిలిం

రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాదులను దేశం నుండి తరిమికొట్టి వారి దాస్యశృంఖలాల చెర నుంచి దేశాన్ని కాపాడేందుకు సర్వస్వం త్యాగం చేసిన మహనీయులలో వేరెన్నికగన్న వారు దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వర రావు పంతులు గారు.

ఆ మహనీయుని జీవితం ఆధారంగా అమృతాంజన్ లిమిటెడ్ వారు 'దేశోద్ధారక' అనే టెలిఫిలింను నిర్మిస్తున్నారు. ఆనాడు 'ఆంధ్రపత్రిక'ను స్థాపించి స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించి, ప్రజల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించిన వ్యక్తి నాగేశ్వరరావు పంతులుగారు.

ఇందులో పంతులుగారి పాత్రను జి.ఎ.సి. శేఖర్ పోషిస్తుండగా, వారి అర్ధాంగి రామాయమ్మగారి పాత్రను లక్ష్మీప్రియ పోషిస్తోంది. కుమార్తెగా ఆశ్రీప్రియ, శ్రీ శివలెంక శంభుప్రసాద్‌గా సి.హెచ్. నరసింహామూర్తి, ప్రకాశం పంతులుగా సి.హెచ్. కృష్ణమూర్తి నటిస్తున్నారు.

శ్రీ నాగేశ్వరరావు పంతులుగారి మనవళ్లు శ్రీ శివలెంక రాధాకృష్ణ, శ్రీ శివలెంక నాగేశ్వరరావుగార్ల సమక్షంలో యిటీవల ఈ టెలిఫిలిం ప్రారంభమైంది. నల్లంరెడ్డి ప్రసాద్ ఈ ఫిలింకు దర్శకత్వం వహిస్తున్నారు.